దేవరకద్ర, మార్చి 13 : ఒకప్పుడు ఉల్లిని కోస్తేనే కాదు.. ధర విన్నా కళ్లల్లో నీళ్లు తిరిగేవి. అలాంటిది ఇప్పుడు రైతుల కళ్లల్లో ఉల్లి ధర కన్నీరు తెస్తోంది. గతేడాది డిసెంబర్‌లో ఉల్లి ధర పెరగగా రైతు వద్ద దిగుబడి లేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు దిగుబడులు పెద్ద మొత్తంలో వస్తున్నా ధరలు మాత్రం పెరగడం లేదు. రెండు నెలల నుంచి ఉల్లి ధర వంద రూపాయలకు అటు ఇటుగా నమోదవుతున్నాయి. గరిష్ఠ ధర వచ్చిన రైతులకు కొంతవరకు లాభాలు వస్తుండగా, కనిష్ఠ ధర వస్తున్న రైతులు నష్టాలను భరించక తప్పడం లేదు. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించిన ఉల్లిని విక్రయించేందుకు బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. ఉల్లి రాకతో వ్యవసాయ మార్కెట్‌యార్డు కళకళలాడుతోంది. యార్డులో రోజు రోజుకు అన్ని సరుకుల ధరలు పెరుగుతున్నా ఉల్లి ధరలు మాత్రం పెరగడం లేదు. మార్కెట్‌లో జరిగిన లావాదేవీల్లో ఉల్లి ధర రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. వ్యాపారులు నిర్వహించిన వేలంలో గరిష్ఠంగా రూ.1550, కనిష్ఠంగా రూ.700 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి ఎల్లయ్య తెలిపారు. ప్రస్తుతం సీజన్ కావడంతో మార్కెట్‌కు ఉల్లి పెద్ద మొత్తంలో వస్తోందని ఆయన పేర్కొన్నారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో తెల్లగా ఉన్న గడ్డకు కొంతవరకు డిమాండ్ ఉండగా, ఇక ఎర్ర ఉల్లిని కొనేవారు కరువయ్యారు. విత్తనాలు కొనే సమయంలో ఉల్లి రకం ఎలా ఉంటుందో తెలియని రైతులు దిగుబడులు వచ్చాక నెత్తిన చేతులు పెట్టుకుంటున్నారు. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌కు 465 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి ఎల్లయ్య తెలిపారు.

పెరిగిన దిగుమతులు

కాగా, కర్నూల్, హైదరాబాద్ మార్కెట్‌లకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది లారీల ఉల్లి దిగుమతులు వచ్చిన కారణంగా ధరలు పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు. బయట నుంచి వచ్చే ఉల్లి ధర కన్నా మన మార్కెట్‌లో రూ.200 నుంచి రూ.300 వరకు ఎక్కువగా ఉందని వారు పేర్కొన్నారు.

19న తెలంగాణ కామర్స్ ఫెస్ట్

- పీయూలో ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్ విడుదల


తెలంగాణ కామర్స్ ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్స్‌ను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, కామర్స్ విభాగం అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 13 : పాలమూరు యూనివర్సిటీలో ఈనెల 19న తెలంగాణ కామర్స్ అసోసియేషన్, పీయూ కామర్స్ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న యూనివర్సిటీ స్థాయి ఇంటర్ కాలేజ్ కామర్స్ ఫెస్ట్ ప్రేరణ నిర్వహించనున్నట్లు కామర్స్ విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. కామర్స్ ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన బుధవారం పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్‌తో కలిసి విడుదల చేశారు. ఫెస్ట్ కార్యక్రమంలో వ్యాసరచన, రంగోలి, బిజినెస్ క్విజ్, ఫేస్ పెయింటింగ్, కామర్స్ క్వెస్టా, పేపర్ ప్రజెంటేషన్, జస్ట్ మినిట్, వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ అనురాధరెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ రంగప్ప, డాక్టర్ వెంకటేష్ తదితరులున్నారు.

ప్రపంచ దేశాల సరసన భారత్

భారతదేశం సాంకేతిక రంగంతో పాటు, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ, అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ ఆయా దేశాల సరసన నిలుస్తున్నదని పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ తెలిపారు. బుధవారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్‌లో వర్చువల్ ద్వారా సెమీ కండక్టర్స్ ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీస్ శిలాఫలకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించగా వీసీ తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ మాట్లాడుతూ మన దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, యువకులకు చాలా అవకాశాలు వస్తాయని వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీయూ పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం


నరసింహగౌడ్ (ఫైల్)

- బస్‌షెల్టర్‌కు ఢీ..
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

కొత్తకోట, మార్చి 13 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రాయనిపేట గ్రామ శివారు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది.

ఎస్సై మంజునాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అప్పరాల గ్రామానికి చెందిన అక్కల నరసింహగౌడ్(45), రమేష్ అనే వ్యక్తులు ద్విచక్ర వాహనంపై బుధవారం కొత్తకోట నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా రాయనిపేట గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి బస్‌షెల్టర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో నరసింహగౌడ్ తలకు బలమైన దెబ్బ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే


జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. తన నియోజకవర్గంలోని తోమాలపల్లి గ్రామం నుంచి కొత్తకోట మీదుగా వస్తుండగా ప్రమాదాన్ని చూసి తన కాన్వాయ్‌ను ఆపారు. క్షతగాత్రులను పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం తన వాహనంలో వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

మహిళను ఢీకొన్న బైక్.. ముగ్గురికి గాయాలు

గోపాల్‌పేట : రోడ్డు దాటే క్రమంలో వేగంగా వచ్చిన బైక్ మహిళను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ నగదు తీసుకునేందు కోసం మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకు వద్దకు వెళ్తు రోడ్డును దాటుతుండగా, మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై వేగంగా వస్తూ ఆమెను ఢీకొన్నారు. ప్రమాదంలో మహిళతో పాటు, బైక్ వెనుక సీటుపై కూర్చున్న యువకుడికి తీవ్ర గాయాలు కాగా, బైక్ నడుపుతున్న మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వస్తున్న ఎస్సై హరిప్రసాద్ గాయపడిన వారిని స్థానిక ఆరోగ్య కేంద్రానికి ఆటోలో పంపించారు. మహిళను చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కందనూలు, మార్చి 13 : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు, ఓ కోఆప్షన్ సభ్యుడు, పలువురు సీనియర్ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒకటవ వార్డు కౌన్సిలర్ అప్పల ఇందిర, 4వ కౌన్సిలర్ జాజాల జ్యోతి, 7వ వార్డు కౌన్సిలర్ కాకనూరి నాగమ్మ, 9వ వార్డు కౌన్సిలర్ కొండూరు లలిత, 10వ వార్డు కౌన్సిలర్ బాదం సునీత, 20వ వార్డు కౌన్సిలర్ పద్మమ్మ, 19వ వార్డు కౌన్సిలర్ బచ్చన్న యాదవ్‌తో పాటు మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు నరసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాదం నరేందర్, మాజీ వార్డు సభ్యులు పాండుచారి, ఎండబెట్ల శ్రీనివాస్‌తో పాటు మరికొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కారాజ్‌కుమార్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, ఎండి.నిజామ్, సునేంద్రకుమార్ నాయకులు కొత్త బలరాం తదితరులు పాల్గొన్నారు.

కర్రతో బండి చక్రం

గడియారం, సీసా లోపల ఐన్‌స్టీన్ చిత్రం



కర్రతో చేసిన చక్రాలు

పెద్దకొత్తపల్లి, మార్చి 13 : కర్రతో బండి చక్రం, కర్రతో గడియారం తయారీ, సీసా లోపలి ఉపరితలంపై ఐన్‌స్టీన్ చిత్రం వేసినట్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డు అవార్డు గ్రహీత బసవోజు బ్రహ్మచారి తెలిపారు. మార్చి 14 భౌతిక శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ జయంతి, అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రపటాలను వేసినట్లు ఆయన చెప్పారు.

వివాహ వేడుకలో భారీ దొంగతనం

- 30 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన దుండగుడు
- సీసీ కెమెరాలో అనుమానితుడి ఆనవాళ్లు


చోరీ జరిగిన ఫంక్షన్‌హాల్‌లో ఆనవాళ్లను సేకరిస్తున్న క్లూస్‌టీం సిబ్బంది

గద్వాల క్రైం, మార్చి 13 : జోగుళాంబ గద్వాల జిల్లాను కొంతకాలంగా దొంగలు దత్తత తీసుకున్నట్లు ఉన్నది. జిల్లాలో ప్రతీరోజు ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల కంటే జిల్లా కేంద్రంలోనే ఈ ఘటనల సంఖ్య పెరిగిపోయింది. తాజాగా ఓ వివాహ వేడుకలో కూడా మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగ ఒకరు ప్రవేశించి 30 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక కృష్ణారోడ్‌లోని ఎస్.వీ. ఈవెంట్ హాలులో బుధవారం రాజకీయ నాయకుడు అయిన బీరెల్లి రాధాకృష్ణారెడ్డి వివాహం జరగాల్సి ఉంది. అయితే రాధాకృష్ణారెడ్డి తమ్ముడు అయిన కృష్ణవర్ధన్‌రెడ్డి, ఆయన కుటుంబం మంగళవారం రాత్రే ఫంక్షన్‌హాల్‌కు వచ్చారు. పెళ్లికని వారు తెచ్చుకున్న 30 తులాల బంగారు ఆభరణాలను ఓ బ్యాగులో ఉంచారు. మంగళవారం రాత్రి ఒంటి గంట వరకు వారు పెళ్లి కార్యక్రమాలను పూర్తిచేసుకొని నిద్రలోకి జారుకున్నారు. బుధవారం ఉదయం కృష్ణవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులు బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ కోసం వెతకగా కనపడలేదు. దీంతో దొంగతనం జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్ఐ సంఘటనా స్థలానికి పరిశీలించాడు. క్లూస్‌టీంలతో వివరాలను సేకరించారు. అర్ధరాత్రి 2 గంటల తర్వాత ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ఫంక్షన్‌హాల్‌లోకి ప్రవేశించి ఆ ఆభరణాలు ఉన్న సంచిని దొంగిలించి తీసుకెళుతున్నట్లు వీడియో సీసీ కెమెరాలో నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నానన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గోపాల్‌పేట, మార్చి 13 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మునగాల శివానందం రావు అతని భార్య శనివారం రోజు పని నిమిత్తం హైదరాబాద్‌లోని తన చెల్లెలి ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగుడు మంగళవారం అర్ధరాత్రి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగలగొట్టి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లాడు. శివానందానికి వరుసకు బాబాయ్ అయిన పెంటయ్య గమనించి ఇంట్లో దొంగలు పడ్డారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణ జరుగుతుండగా అదే గ్రామానికి చెందిన ఏశమోని ఆంజనేయులు బైక్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు ఆపి అతనిని తనిఖీ చేశారు. అతని వద్దనున్న బ్యాగులో బంగారం, నగదు కనిపించాయి. ఆంజనేయులును అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న కానిస్టేబుల్ వంశీ, ఆంజనేయులును అధికారులు అభినందించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ నాగభూషణ్‌రావు, క్లూస్ టీం ఏఎస్సై రవి పరిశీలించారు.

గృహిణి ఆత్మహత్య


సరిత (ఫైల్)

కొత్తకోట, మార్చి 13 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం ముమ్మళపల్లి గ్రామంలో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సరిత (25) ఇద్దరు పిల్లలతో పాటు, భర్త, అత్తమామ ఇటిక్యాల మండలం జల్లపూర్‌లో జరుగుతున్న బంధువుల పెళ్లికి బుధవారం ఉదయం వెళ్లిపోయారు. తనను ఒక్కదానిని ఇంట్లో వదిలేసి అందరూ పెళ్లికి వెళ్లడంతో మనస్తాపం చెందిన ఆమె మధ్యాహ్న సమయంలో ఉరి వేసుకొంది. పక్కింటివారు ఆమెను పిలిచినా పలుకకపోవడంతో అనుమానం వచ్చి ఇల్లు తెరిచి చూశారు. ఉయ్యాల కొండ్లకు తాడుతో ఉరి వేసుకున్న ఆమెను చూసి చుట్టుపక్కల వారి సహాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. వెంటనే భర్త మారుతి, అత్తమామలకు సమాచారం ఇచ్చారు. సరిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

పెద్దకొత్తపల్లి, మార్చి 13 : కుటుంబ కలహాల వల్ల ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధితురాలు, హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామానికి చెందిన గుంటి శివలీలను ఆమె అన్న గుంటి సుధాకర్, అతని భార్య గుంటి నవీన, గుంటి శేఖర్, భార్య జయమ్మలు కలిసి పాత గొడవలు మనసులో పెట్టుకుని నానా బూతులు తిట్టి, జుట్టు పట్టుకొని ఇంట్లో నుంచి రోడ్డుపైకి ఈడ్చుకుంటూ వచ్చి కడుపులో తన్నుతూ దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా చంపుతామంటూ బెదిరిస్తూ అడ్డొచ్చిన శివలీల అమ్మ లక్ష్మీదేవమ్మపై కూడా దాడి చేసి గాయపర్చారన్నారు. దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పడంతో గుంటి శివలీల వెంటనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో కుటుంబ సభ్యులు, పోలీసులు వెంటనే 108లో చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శివలీలపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంచంద్రయ్య తెలిపారు.

పులి దాడిలో ఎద్దు మృతి


పులిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ సిబ్బంది

దోమలపెంట, మార్చి 13 : నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతం అమ్రాబాద్ అభయారణ్యం దోమలపెంట రేంజ్ పరిధిలోని సార్లపల్లి సౌత్ బీట్‌లో మంగళవారం పశువుల మందపై పెద్ద పులి దాడి చేసి ఎద్దును చంపివేసినట్లు రైతు మండ్లి ఈరయ్య అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ ఆదేశం మేరకు బుధవారం ఎఫ్‌బీవో ముత్యాలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పులి దాడిలో ఎద్దు మృతి చెందినట్లు నిర్ధారణ చేసి పంచనామా నిర్వహించారు. పులిని గుర్తించేందుకు ఘటనా స్థలంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎఫ్‌బీవో ముత్యాలు పేర్కొన్నారు. పంచనామా నివేదికను పైఅధికారులకు అందిస్తామని, రైతుకు అటవీశాఖ తరుపున నష్టపరిహారం అందిస్తామని అధికారులు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.40వేలు ఉంటుందని రైతు ఈరయ్య పేర్కొన్నాడు.

కర్ణాటక మద్యం పట్టివేత, ఇద్దరిపై కేసు నమోదు


పట్టుకున్న కర్ణాటక మద్యంతో పాటు, నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

గద్వాల క్రైం, మార్చి 13 : కర్ణాటక నుంచి తెలంగాణకు తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం కుట్కనూరు గ్రామ శివారులో మంగళవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కర్నూల్‌కు చెందిన కుర్వమల్లేష్, కుర్వరాముడు ఇద్దరు రెండు వాహనాలపై కర్ణాటక రాష్ట్రానికి చెందిన 25.92 లీటర్ల ఒరిజనల్ చాయిస్ మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని, స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు వెంకటేష్, నాగరాజు, కానిస్టేబుల్స్ మహేష్, వేణు, శేఖర్, రాజు తదితరులున్నారు.

భూమి రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

జడ్చర్ల, మార్చి 13 : మోసపూరితంగా సంతకాలు చేయించుకుని భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం దాసరి సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్సై శివానంద్ తెలిపారు. గ్రామ శివారులోని సరోజ స్వంత పొలంలో కూలీ పనులకు వచ్చిన కూలీలకు ఓ అనాధ బాబు కనిపించడంతో ఆ బాబును తీసుకువచ్చి తన తల్లి దాసరి అనసూయమ్మకు ఇచ్చారు. ఆ బాబుకు శ్రీనివాసులు అని పేరుపెట్టి తనతో పాటు పెంచుకుందని దాసరి సరోజ ఫిర్యాదులో పేర్కొందని తెలిపారు. పది సంవత్సరాల క్రితం తన తల్లిదండ్రులు మృతి చెందారని, తన తల్లి అనసూయమ్మ పేరుపై నాలుగెకరాల 28 గుంటల భూమి ఉందని, ఆ భూమిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయిస్తానని మోసపూరితంగా తనతో సంతకాలు తీసుకుని, తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొందని వివరించారు. మోసపూరితంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయంపై ప్రశ్నిస్తే చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని, న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి



బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంఆర్ సునీత

వనపర్తి క్రైం, మార్చి13: సమాజంలో చేస్తున్న సేవలు ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.ఆర్ సునీత అన్నారు. బుధవారం న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈనెల 16న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను ఇరు పక్షాల వారు సమన్వయంతో పరిష్కరించుకోవాలని కక్షిదారులకు ఆమె సూచించారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా ఆమె బోరు మోటార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయాధికారులు రజిని, రవికుమార్, శ్రీలత, జానకి, న్యాయవాద సంఘం అధ్యక్ష, కార్యదర్శి మోహన్ కుమార్ యాదవ్, బాలనాగయ్య, సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు కృష్ణయ్య, అనంతరాజ్, రాంధూళి, జయలక్ష్మి, నాగేశ్వర్, వెంకటేష్, వెంకటేశ్వర్ రెడ్డి, షాకీర్ హుస్సేన్, తిరుపతయ్య, బాలయ్య, రియాజ్, అహ్మద్, నరేందర్, రాజు, మమత కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పరమేశ్వర స్వామి పల్లకీ సేవ



పల్లకీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న పుర ప్రముఖులు

ఆత్మకూరు, మార్చి13: పట్టణ కేంద్రంలోని చెరువులో వెలసిన పరమేశ్వర స్వామి జాతర సందర్భంగా ఆత్మకూరు పుర చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్, వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు మహేశ్వరి, నాగలక్ష్మి, రామకృష్ణ, యాదమ్మ, చెన్నయ్య ఆధ్వర్యంలో పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రారంభమైన పల్లకీ సేవ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఆలయానికి చేర్చారు. తేరు లాగే కార్యక్రమాన్ని భక్తులు తిలకించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు నాగేంద్రంరెడ్డి, గడ్డమీద శ్రీనివాస్, రమేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

పాన్‌గల్, మార్చి13: పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో కోటేశ్వర్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన జీహెచ్‌ఎం శంకరయ్య మాట్లాడుతూ కేతేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాలను తన జీవితంలో ఎప్పటికి మరిచిపోలేనని అన్నారు. అనంతరం శంకరయ్యను పాఠశాల హెచ్‌ఎం రవికుమార్‌తో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అదే విధంగా గ్రామానికి చెందిన వంగూరు బాలీశ్వర్‌రెడ్డి కుమారుడు ఎన్‌ఆర్‌ఐ అనీష్ రెడ్డి అందజేసిన ప్యాడ్లు, పెన్నులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీపనగండ్ల మండల కేంద్రంలో..

వీపనగండ్ల: పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తొమ్మిద తరగతి విద్యార్థులు పదో తరగతి వారికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, మహేష్, శేఖర్, బాలు, శ్వేత, సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

కొప్పునూరు గ్రామంలో..

చిన్నంబావి: మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నరసింహ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి, తల్లిదండ్రులు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు సహకరించాలి

పాన్‌గల్, మార్చి 13: క్షయ వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని వైద్యాధికారిణి మైథిలి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దవాజిపల్లి గ్రామంలో మండల పంచాయతీ అధికారి రఘురాములు ఆధ్వర్యంలో టీబీ బృందం సభ్యులు పర్యటించి అనుమానితులకు తెమడ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన రోగులు ఆరునెలలు మందులు వాడితే పూర్తిగా నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎస్ నగేష్, ఎస్‌టీఎల్‌ఎస్ ప్రవీణ్, ఆరోగ్య విస్తరణ అధికారి కొండా శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి

అమరచింత, మార్చి 13: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని మౌలిక వసతులు కల్పించేలా అధికారులు దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి సయ్యద్ సుల్తాన్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకంలో ఆయా గ్రామాల క్షేత్ర, సూక్ష్మ సహాయకులు తదితర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ప్రతీరోజు విధిగా గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదన్న విషయాన్ని అడిగి తెలుసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీవో నరసింహయ్య, ఉపాధి హామీ టెక్నికల్ అధికారి రఘు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు, మార్చి 13: ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆస్తిపన్ను చెల్లించాల్సిన వినియోగదారులు ఆస్తిపన్ను రాయితీని సద్వినియోగం చేసుకొని తక్షణమే ఆస్తిపన్ను చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని ఆయా కాలనీలో మునిసిపల్ సిబ్బందితో కలిసి ఆస్తి పన్ను వసూలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి'

వనపర్తి రాజీవ్‌చౌరాస్తా, మార్చి13: జిల్లాలో సాగు భూముల సమస్యలు పరిష్కరించి పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈనెల 23న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న భూ సదస్సుకు సంబంధించి కరపత్రాలను బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. కార్యక్రమంలో పోడు భూముల గ్రామాల రైతులు బోయ స్వామి, మురళి, భీముడు, శారద , చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

దంతనూరులో ప్రత్యేక వైద్య శిబిరం

మదనాపురం, మార్చి 13: మండలంలోని దంతనూరు గ్రామంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా గ్రామంలో చికెన్ గున్యా లక్షణాలతో అనేక మంది జ్వరంతో బాధపడుతున్నారని వైద్యసిబ్బంది 99 మందిని పరీక్షించారు. ఇందులో 51 మందికి చికెన్ గున్యా లక్షణాలు ఉన్నాయని వారి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. పరీక్షించిన రోగులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో శ్రీనివాసులు, ఎంపీపీ జన్ను పద్మావతి, వైస్ ఎంపీపీ యాదమ్మ, తహసీల్దార్ అబ్రహాంలింకన్, ఎంపీడీవో చెన్నమ్మ, ఆర్‌ఐ రాజేశ్వరి, ఎంపీవో పుష్ప, పంచాయతీ కార్యదర్శి విక్రమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోకాయుక్తకు చేరిన నిధుల పంచాయితీ

వనపర్తి టౌన్, మార్చి 13: వనపర్తి మునిసిపాలిటీలో చేసిన నిధుల ఖర్చు పంచాయితీ లోకాయుక్తకు చేరింది. 2021-22వ, 2022-23 సంవత్సరంలో నిధుల ఖర్చులపై సమగ్ర వివరాలు ఇవ్వాలని వాల్మీకి బోయ సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు గతేడాది సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరారు. దీంతో గతంలో వనపర్తికి వచ్చిన మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చాడని మండ్ల దేవన్న నాయుడు లోకాయుక్తను ఆశ్రయించాడు. బుధవారం లోకాయుక్త ముందు రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మండ్ల దేవన్న నాయుడు ఇద్దరు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. కానీ విచారణకు రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరుకాలేదు. తప్పుడు సమాచారం ఇచ్చిన వనపర్తి మునిసిపల్ కమిషనర్‌పై హైకోర్టుకు, గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తానని మండ్ల దేవన్న నాయుడు తెలిపారు.

మెడికల్ విభాగంలో ఎల్‌టీల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- ఘనంగా ల్యాబ్‌టెక్నీషియన్ దినోత్సవం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ల్యాబ్ టెక్నీషన్ యూనియన్ సభ్యులు

వనపర్తి టౌన్, మార్చి 13: మెడికల్ విభాగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర కీలకమైందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం ల్యాబ్ టెక్నీషన్ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య వృత్తిలో ల్యాబ్ టెక్నీషన్ ఇచ్చే రిపోర్టు ఆధారంగానే వైద్యుడు రోగికి వైద్యం చేస్తాడని, అంతటి ప్రాముఖ్యత కలిగిన వృత్తిలో ఉన్న ఎల్‌టీలు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. కరోనా లాంటి విపత్తర పరిస్థితుల్లో ఎల్‌టీలు సైతం తమ ప్రాణాలను పణంగా పెట్టి రోగులకు సేవలు అందించారని కొనియాడారు. ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ భవన నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని కలెక్టర్‌తో మాట్లాడి ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఎల్‌టీ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కేట్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, ఎల్‌టీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటా

అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న బాధితులు అధైర్యపడొద్దని అండగా ఉంటానని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న వనపర్తి మునిసిపల్ కౌన్సిలర్ బ్రహ్మంచారిని, హైదరాబాద్‌లోని నిమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దగూడెం గ్రామానికి చెందిన నక్క రవికిరణ్, పట్టణంలోని శ్రీనివాసపురా నికి చెందిన విభూది పెద్ద కురుమయ్య, రేవల్లి మండలానికి చెందిన టప్ప రాజయ్యతో పాటు పలు అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే మేఘారెడ్డి బుధవారం ప రామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, మార్చి13: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అనేకమంది ఆకర్షితులు అవుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొన్నూరు గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ఇచ్చి నెరవేర్చిందన్నారు. నిరుద్యోగులకు నోటిఫికేషన్‌లు వేయడం, ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భవిష్యత్తులో మరింత మంది పార్టీలు మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వంశీ చంద్‌రెడ్డి, నాయకులు శరత్‌రెడ్డి, ప్రశాంత్, కృష్ణవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, చుక్కా జగన్, సతీష్‌రెడ్డి, వెంకటస్వామి, సత్తన్నగౌడ్, పుట్టకురుమన్న, రామకృష్ణ, జగదీష్, మహేష్‌కుమార్, శేఖర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

రైతులను దేశద్రోహులుగా మార్చిన ఘనత బీజేపీది

- పార్లమెంట్ ఎన్నికల లబ్ధికోసమే ఎన్‌ఆర్‌సీ, సీఏఏ
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్ వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్ వెస్లీ

అమరచింత, మార్చి 13: పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని శాంతియుతంగా ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతుల పట్ల సాను భూతి చూపేది పోయి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వారిని దేశద్రోహులుగా ముద్రించడం సిగ్గు చేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ అధ్యక్షతన సీపీఎం వనపర్తి జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందడానికి హడావుడిగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎన్‌ఆర్‌సీ, సీఏఏలను తీసుకొచ్చిందని విమర్శించారు. అటువంటి చర్చ లేకుండా ఆగమేఘాల మీద తీసుకొచ్చిన ఎన్‌ఆర్‌సీసీఏను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతీ ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షల నగదు ఇస్తానని చెప్పి ఏ ఒక్కటి ఇవ్వకుండా బీజేపీ వారు ఎలక్ట్రోల్ బాండ్ల ద్వారా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పుట్ట ఆంజనేయులు, మహమూద్ , బాల్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మేకల ఆంజనేయులు, అజయ్, రమేష్, వెంకటేష్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మ్యాజిక్స్‌ను ప్రదర్శిస్తున్న విజ్ఞాన దర్శని నాయకులు

పాన్‌గల్, మార్చి 13: తరగతి గది నుంచే ప్రయోగాలు ప్రారంభించాలని, రానున్న కాలంలో విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని విజ్ఞాన దర్శని రాష్ట్ర అధ్యక్షుడు టి. రమేష్ ఆకాంక్షించారు. బుధవారం మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో లిటిల్ స్టార్ హైస్కూల్‌లో 'సైన్స్ నా ఊపిరి' అనే అంశంపై వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌ను ప్రేమించాలని, ప్రేమించే తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను మటుమాయం చేయాలని, విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం కోసం సైనికులుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు జితేందర్ మాట్లాడుతూ దేన్ని గుడ్డిగా నమ్మొద్దని పరిశీలన శక్తిని పెంచుకోవాలని అన్నారు. ట్రస్మా జిల్లా నాయకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సైన్స్ ప్రపంచానికి గుండెకాయ లాంటిదని అభివర్ణించారు. జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డప్పు స్వామి, ప్రముఖ కళాకారుడు పాము నాగులు, దళిత ఉద్యమ నాయకులు మీసాల రాము, గాయకులు బండారు కుర్మయ్య తమ ఆట పాటలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. విజ్ఞాన దర్శిని నాయకులు ప్రదర్శించిన మ్యాజిక్స్ విద్యార్థులను ఎంతగానో ఆలోచింపజేశాయి. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శేఖర్‌యాదవ్, కరస్పాండెంట్ కాకం ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి

వనపర్తి రూరల్, మార్చి 13: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం వనపర్తి పట్టణంలోని నాగవరం ప్రభుత్వ బీసీ బాలుర వసతి, వివిధ వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం ఆవరణ పరిసర ప్రాంతాలు వంటగది పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. విద్యార్థులకు వండిన అల్పాహారం పరిశీలించి స్వయంగా విద్యార్థులకు వడ్డించారు. విద్యార్థులతో పాటే ఆయన కూడా అక్కడే అల్పాహారాన్ని తీసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన భోజనం అందించాలని , వచ్చే సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నందున విద్యార్థులకు ప్రత్యేకంగా స్నాక్స్ అందజేయాలని వసతి గృహ సంక్షేమ అధికారికి ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ పరీక్షలు అనగానే భయపడాల్సిన అవసరం లేదన్నారు. పరీక్షలు రాసే విధానంపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు వేసి సామర్థ్యాలను పరీక్షించారు. ఏకాగ్రతతో చదువుపై శ్రద్ధ పెడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ప్రతీ విద్యార్థి ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలని వసతి గృహ సంక్షేమ అధికారిని కోరారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి రమేష్ గౌడ్, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ పట్టివేత

పెద్దమందడి, మార్చి 13: పెద్దమందడి మండల పరిధిలోని వెల్టూరు గ్రామ సమీపంలోని చిల్కటోనిపల్లి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నట్లు ఆర్‌ఐ తిరుపతయ్య తెలిపారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనుమతి లేకుండా వాగుల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇసుక తరలించడం వలన భూగర్భ జలాలు అట్టడుగుపోతాయన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కవయిత్రి మొల్ల రచనలు సమాజానికి ఆదర్శం కావాలి



కవయిత్రి మొల్ల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీజేఏసీ నాయకులు

వనపర్తి టౌన్, మార్చి 13: బహుజన రచయిత్రి కుమ్మరి మొల్ల రచనలు సమాజానికి ఆదర్శం కావాలని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో టీజేఏసీ నాయకులు తొలి తెలుగు రచయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన కవులలో తెనాలి రామలింగడు కవికి సమకాలీకురాలు మొల్ల అని కొనియాడారు. రామాయణ గ్రంథాన్ని తెలుగులోకి అనువాదించిన కవయిత్రి మొల్ల రచనల స్ఫూర్తితో నేటి తరం కవులు రచనలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాయికంటి నరసింహశర్మ, కావలి బాలస్వామి నాయుడు, బాలేమియా, నూగూరు రాము, వెంకటయ్య, శ్రీనివాసు పాల్గొన్నారు. అలాగే మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం పట్టణ అధ్యక్షుడు బొంబాయి మన్నెంకొండ, డాక్టర్ చైతన్యగౌడ్, కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు గుణగంటి ఆంజనేయులు, నూగూరు నరసింహ, పరశురాం, మన్నెం, కొండన్న, వెంకటయ్య, రాము, వాసు పాల్గొన్నారు.

బుసిరెడ్డిపల్లి గ్రామంలో..

పాన్‌గల్: మండలపరిధిలోని బుసిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం శాలివాహన (కుమ్మర)సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలివాహన సంఘం జిల్లా నాయకులు సూర్యవంశం మొగులయ్య, సూర్యవంశం ఉషన్న మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాటి కాలంలో మహిళలో అభ్యుదయ భావాలు కలిగించిన మాతృమూర్తి కొనియాడారు. కార్యక్రమంలో సన్న జాజుల రాముడు, సూర్యవంశం చిన్నరాముడు, సూర్యవంశం శంకర్, రాముడు తదితరులున్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

- ఎంఈవో లక్ష్మణ్‌నాయక్

వీపనగండ్ల, మార్చి13: విద్యార్థులలో తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులలో సామర్థ్యాలను మెరుగు పరచాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని సంగినేనిపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఏప్రిల్ మాసంలో నిర్వహించనున్న సంగ్రహణ మూల్యాంకనం పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయుకు సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేశ్వరయ్య, సీఆర్పీ నాగరాజు, ఉపాధ్యాయులు అరుణ, చిన్న రాములు తదితరులున్నారు.

మక్తల్‌కు ద్విచక్ర వాహన ర్యాలీ



ప్రజా దీవెన సభకు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత, మార్చి 13: మక్తల్‌లో నిర్వహించిన ప్రజా దీవెన సభకు బుధవారం కాంగ్రెస్ మండల నాయకులు ద్విచక్ర వాహన ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై అమరచింతకు వచ్చారు. అక్కడి నుంచి ఆ పార్టీ నాయకులు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించగా మక్తల్‌కు వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, నాయకులు విష్ణు, శ్యామ్, మహమ్మద్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సత్తన్న, తౌఫిక్, శ్రీధర్, హనుమంత్ నాయక్, చిన్న దేవరాజు, కార్యకర్తలు తదితరులున్నారు.

సమస్యలపై పట్టింపు లేదు

- టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్ పాషా

వనపర్తి టౌన్, మార్చి 13: వనపర్తి మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలు అధికారులకు పట్టడం లేదని తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్ పాషా అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని నెలలుగా వనపర్తి మునిసిపాలిటీలో పారిశుధ్యం పడకేసిందని, ప్రధాన డ్రైనేజీలో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. పట్టణంలోని పారి శుధ్యంపై శానిటరీ ఇన్స్‌పెక్టర్, కమిషనర్ నిర్లక్ష్యం వహి స్తున్నారని ఆయన విమర్శించారు. తక్షణమే పారిశుధ్య పనులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

- మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ

పెబ్బేరు, మార్చి13: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలో అద్వైత్ హస్పిటల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ అన్ని వేళలో ప్రజలకు అందు బాటులో ఉండి వైద్య సేవలందించాలని కోరారు. హాస్పి టల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్ గోపిబాబు, సాయినాథ్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

మదనాపురం, మార్చి 13: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న అయిదు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో తిర్మలాయపల్లె గ్రామంలో గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతీ నెల 5న వేతనాలు విడుదల చేయాలన్నారు. అలాగే మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు మధు, శాంతన్న, రాములు, రమేష్, ప్రియదర్శనం పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దమందడి, మార్చి13: వేసవి కాలంలో ఉపాధి హామీ కూలీలు పనులు చేసే ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీవో శ్రీరామ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బలిజపల్లి గ్రామంలో ఉపాధిహామీ ఫీడర్‌చానల్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి , వనపర్తి కళాజాత బృందం కలిసి వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆట పాట ద్వారా అవగాహన కల్పించారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్క పౌరుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

అమరచింత, మార్చి 13 : గుండెపోటుతో మునిసిపల్ కార్మికుడు నాగరాజు(50) బుధవారం మృతి చెందాడు. నాగరాజు ఎప్పటిలా మునిసిపల్ విధులకు హాజరు కావడానికి తెల్లవారుజామున రెడీ అవుతుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నూరుల్‌నజీబ్, వైస్‌చైర్మన్ జీఎస్.గోపి తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తకోట, మార్చి 13: పట్టణానికి చెందిన దేవి సినిమా థియేటర్ మొద్దు రామకృష్ణారెడ్డి (72) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి రామకృష్ణారెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలిపారు. అలాగే కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పలువురు రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బీజేపీ నాయకుల సంబురాలు

అమరచింత/ఆత్మకూరు, మార్చి13: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరు ప్రకటించడంపై బుధవారం రాత్రి అమరచింత, ఆత్మకూరులో ఆ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.